ప్రజాశక్తి
శనివారం 18 నవంబర్ 2023
5
శ్రీ సత్యసాయి

అధికారులు కులసంఘాల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పకడ్బందీగా కులగణన

కలెక్టర్ అరుణ్ బాబు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లాలో ఈనెల 27 నుంచి డిసెంబర్ 10వ తేదీ వరకు కుల గణన కార్యక్రమం జరుగుతుందని, ఇందుకు సంబంధించిన అధికారులు అందరూ సమన్వయంతో పనిచేసి పకడ్బందీగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్లో వివిధ కుల సంఘాల పెద్దలు, ఎన్జీవోలతో కుల గణనపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కుల గణన కార్యక్రమానికి ప్రజలందరూ పూర్తిగా సహకరించి విజయవంతం చేయాలన్నారు. కుల గణనపై గ్రామాల్లో టామ్ టామ్ వేయించడం వాలంటీర్లు ఇంటింటికీ వెళ్లి తెలియజేయనున్నట్లు చెప్పారు. సచివాలయ సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి కుల గణన చేపట్టనున్నట్లు చెప్పారు. ప్రజలందరూ దీనికి సహకరించాలన్నారు. కులగణన సమాచారాన్ని ప్రత్యేక మొబైల్ యాప్‌లో పొందుపరచనున్నట్లు చెప్పారు. వాలంటీర్లకు సచివాలయ సిబ్బందికి తగిన శిక్షణ ఇచ్చి డిసెంబర్ 10 లోపల పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఒక ఇల్లు కూడా తప్పిపోకుండా పక్కాగా ఈ కార్యక్రమం చేపట్టాలన్నారు. సిబ్బంది ఇంటింటికీ వచ్చినప్పుడు ఆ ఇంటి యజమాని తప్పకుండా వేలిముద్ర వేయాల్సి ఉంటుందని, యజమాని అందుబాటులో లేకపోతే ఆ కుటుంబ సభ్యులు వేలిముద్ర వేయాల్సి ఉంటుందన్నారు. ఈ కుల గణన ద్వారా జిల్లాలో ఏ కులానికి చెందినవారు ఎంతమంది ఉన్నారు.? ప్రభుత్వ పథకాలు ఎవరెవరికి అందుతున్నాయి.? అనే వివరాలు పక్కాగా ఉంటాయన్నారు. దీంతో ప్రభుత్వం పేదలకు ఏమి చేయాలన్న విషయాలు సులభంగా గుర్తించేందుకు కుల గణన ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వాల్మీకి సంఘం కార్పొరేషన్ ఛైర్మన్ పొగాకు రామచంద్ర, వక్క లింగ ఛైర్‌పర్సన్ బి.నలిని, జాయింట్ కలెక్టర్ టిఎస్.చేతన్, పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్, డిఆర్‌ఒ కొండయ్య వివిధ కుల సంఘాల నాయకులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నష్టం లెక్కింపులోనూ కోతలే..!

◆ హెక్టారుకే పరిమితం ◆ వేరుశనగ,పత్తికి రూ.17 వేలే సాయం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

కరువు సహాయం నష్టం అంచనాల్లోనే ప్రభుత్వం కోతలు పెడుతోంది. ఈ మేరకు ప్రభుత్వం జీవో నెంబర్:5ను విడుదల చేసింది. దీని ప్రకారం నష్టం అంచనాలు రూపొందించడంలోనే కోతలు పడనున్నాయి. ఇప్పటికే తీవ్రంగా నష్టపోయిన రైతులకు నష్టం అంచనాల్లో కోతలు పడితే పరిహారం ఏ మేరకు వస్తుందన్నది సర్వత్రా ఆందోళన నెలకొంది.

ప్రభుత్వ మార్గదర్శకాలు ఇలా...

ప్రభుత్వమిచ్చిన మార్గదర్శల ప్రకారం చూస్తే రెండు హెక్టార్ల వరకే పరిహారం ఇచ్చేలాగా నిబంధనలు పెట్టారు. అంతకు మించి పంట సాగు చేసిన దానికి పరహారం అందే అవకాశం లేదు. అది కూడా 33 శాతంపైగా పంట నష్టం సంభవించినట్టు భావిస్తేనే పరిహారానికి అధికారులు సిఫారసు చేయాల్సి ఉంటుంది. ఇకపోతే వేరుశనగ, పత్తి పంటలకు హెక్టారుకు రూ.17 వేలు మాత్రమే పరిహారం ఇవ్వాలని నిర్ణయించింది. సాధారణంగా అయితే వేరుశనగ పంట ఒక్క దానికి హెక్టారుకు రూ.60 వేల వరకు ఖర్చు అవుతుంది. కాని ప్రభుత్వం నష్ట పరిహారాన్ని మాత్రం హెక్టారుకు రూ.17 వేలతోనే ఇవ్వాలని నిర్ణయించింది. పత్తి అదే రకంగా హెక్టారుకు రూ.17 వేలతో లెక్కించనున్నారు. ఇక జొన్న, సజ్జ ఆముదం పంటలకు హెక్టారుకు రూ.8500 మాత్రమే నష్టం అంచనా రూపొందించనున్నారు. కంది, అపరాలు, సోయాబిన్, పొద్దుతిరుగుడు పంటలకు హెక్టారుకు రూ.10 వేలు, మొన్న జొన్న పంటకు రూ.12,500 చొప్పున నష్టాన్ని లెక్కించనున్నారు.

నేటి నుంచి లెక్కింపు ప్రారంభం

పంట నష్టం లెక్కింపు నేటి నుంచి ప్రారంభం కానుంది. కరువు మండలాలు ప్రకటించిన 28 మండలాల్లోనూ ఈ లెక్కింపు ప్రారంభం కానుది. ఈ-పంట నమోదలాగానే నష్టం అంచనాను లెక్కింపు

వేస్తారు. ఈ ప్రక్రియ ఈనెల 20వ తేదీ వరకు జరుగుతుందని జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ ఓ ప్రకటనలో తెలిపారు. 21వ తేది నుంచి 25వ తేదీ వరకు సామాజిక తనిఖీ నిమిత్తం ఏదైనా ఫిర్యాదులుంటే స్వీకరిస్తారు. అనంతరం ఈనెల 27వ తేదీన తుది జాబితాను తయారు చేసి జిల్లా వ్యవసాయాధికారికి పంపుతారు. అనంతరం కలెక్టర్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిస్తారు.

ఇప్పటికే పంట నూర్పిడి పూర్తి

ఖరీఫ్ పూర్తయి రబీ కాలం మొదలయ్యాక ప్రభుత్వం పంటనష్టం అంచనా లెక్కింపును ప్రారంభిస్తోంది. ఇందులో ఏ మేరకు నష్టం అంచనాలు పక్కాగా వస్తాయన్న సందేహాలూ సర్వత్రా వ్యక్తమవుతున్నాయి ఎందుకంటే జిల్లాలో ప్రధాన పంట అయిన వేరుశనగ నూర్పిడి దాదాపు పూర్తయింది. వేరుశనగ పంట వేసిన పొలాలు ఖాళీగానున్నాయి. ఈ నేపథ్యంలో ఈ-పంట బుకింగ్ ఏ రకంగా జరుగుతుందన్నది ప్రశ్నార్థకంగానే మారనుంది. కంది, పత్తి తదితర పంటలు వరకు ఉండవచ్చురాని చాలా వరకు పంటలు పూర్తవుతాయి. అనంతపురం జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో 9.15 లక్షల ఎకరాలు సాగైంది.2.28 లక్షల ఎకరాల్లో వేరుశనగ సాగైంది. ఈ పంట అక్టోబర్ ఆఖరుకే నూర్పిడి పూర్తయింది. ఇప్పుడు ఈ పంటల నష్టం లెక్కింపు ఏ రకంగా జరుగుతుందన్నది ప్రశ్నార్థకంగా ఉంది.

రైతు సంక్షేమం కోసం పని చేయాలి

జాయింట్ కలెక్టర్ టిఎస్.చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ చేతన్

రైతు సంక్షేమం కోసం వ్యవసాయ ఇతర అనుబంధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి అన్ని విధాల రైతులను ఆదుకోవాలని జాయింట్ కలెక్టర్ టిఎస్.చేతన్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్లో జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ ఆవుటల రమణారెడ్డి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రబీ సీజన్లో బోర్ల కింద వేరుశనగ పంట సాగు చేసే రైతులకు సబ్సిడీపైన విత్తనాలు అందించడానికి తీర్మానించి ప్రభుత్వానికి నివేదికను పంపుతున్నట్లు చెప్పారు. పొట్టేళ్ల పెంపకం, కోళ్ల పరిశ్రమలు, పందుల పెంపకం చేసుకునేవారికి బ్యాంకుల ద్వారా రుణ సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లాలో వర్షాభావ పరిస్థితుల వల్ల ఖరీఫ్‌లో పడ్డ సాగు విత్తనం తగ్గిందని ఈ రబీ సీజన్లో రైతులకు మేలు జరుగుతుందని జాయింట్ కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లాలో రాగి పంట విస్తీర్ణం పెంచామని, ఆ పంటకు మద్దతు ధర చెల్లించి ప్రభుత్వమే కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. జిల్లా వ్యవసాయ అధికారి వైవి.సుబ్బారావు మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు అన్ని విధాలా ఉపయోగపడాలని సంకల్పంతో వ్యవసాయ శాఖ ద్వారా వివిధ పథకాలను రైతు భరోసా కేంద్రాల ద్వారా అందించడం జరుగుతుందన్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ ఆవుటాల రమణారెడ్డి మాట్లాడుతూ రైతు సంక్షేమమే లక్ష్యంగా వ్యవసాయ అనుబంధ శాఖల ద్వారా రైతులు లబ్ధి పొందే విధంగా ప్రోత్సహించాలని కోరారు. ఖరీఫ్ సీజన్లో వర్షాభావ పరిస్థితుల వల్ల రైతులు సరిగా పంట సాగు చేయలేకపోయారని తద్వారా కొంతమేరకు ఆర్థికంగా నష్టపోయినట్లు తెలిపారు. జిల్లాలో 32 మండలాలకు గాను 21 మండలాలు మాత్రమే కరువు మండలాలుగా ప్రకటించిందని అందువలన మిగిలిన 11 మండలాలను కూడా కరువు మండలాలుగా ప్రభుత్వం ప్రకటించే విధంగా ఈ సమావేశంలో తీర్మానం చేయాలని కోరారు. లోవోల్టేజి సమస్యలను పరిష్కరించేందుకు విద్యుత్ శాఖ కషి చేయాలన్నారు. ఈ సమావేశంలో కదిరి వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్త చంద్రాయుడు, జిల్లా అగ్రి బోర్డు సభ్యులు బసిరెడ్డి, ఎపిఎంఐపి పీడీ సుదర్శన్, జిల్లా మత్స్య శాఖ అధికారి చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా సహకార శాఖ అధికారి కృష్ణానాయక్, పశుసంవర్ధ శాఖ జేడీ శుభదాస్ తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి జయంతి వేడుకలకు ముస్తాబు అవుతున్న పుట్టపర్తి

నేటి నుంచి సత్యసాయి జయంతి వేడుకలు

◆ ఏర్పాట్లు పూర్తి ◆ ముస్తాబయిన పుట్టపర్తి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

సత్యసాయిబాబా 98వ జయంతి వేడుకలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. అందుకు సంబంధించి సత్యసాయి ట్రస్టు తగిన ఏర్పాట్లను ఇప్పటికే పూర్తి చేసింది. శనివారం ఉదయం 9 గంటలకు పట్టణంలోని వేణుగోపాల స్వామి గుడి నుంచి ప్రశాంతి నిలయం ఫస్ట్ గేట్ వరకు రథోత్సవం జరుగుతుంది. ఈ రథోత్సవం సాయి కుల్వంత్ హాల్లో 18న సత్యసాయి సత్యనారాయణ వ్రతాలు ప్రారంభమవుతాయి. రథోత్సవంలో ట్రస్టు సభ్యులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొంటారు. గోపురం గేట్ నుంచి వేణుగోపాల స్వామి గుడి వరకు రథోత్సవం ఉంటుంది. రథోత్సవంలో అనేకమంది కళాకారులు వారి కళలను ప్రదర్శిస్తారు. ఈ సందర్భంగా గోపురం గేట్ నుంచి వేణుగోపాల స్వామి గుడి వరకు పచ్చ తోరణాలతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. 18 నుంచి 24వ తేదీ వరకు ప్రశాంతి నిలయంలో ఉచిత అన్నదాన ప్రసాదాలు భక్తులకు పర్యాటకులకు పంపిణీ చేయనున్నారు. సాయంత్రం మన్య అరోరా బందం వారిచే ప్రశాంతి నిలయంలో సంగీత కచేరి ఉంటుంది. 19న అతిథులుగా రాజమాత ప్రమోదదేవి వడియార్ యూనియన్, మంత్రి శోభ కరెంధ్లజి పాల్గొంటారు. 20, 21న ప్రముఖ సంగీత కళాకారులచే సంగీత కచేరి ఉంటుంది. 22న 42వ సత్య సాయి యూనివర్సిటీ స్నాతకోత్సవం ఉంటుంది. ఈ కార్యక్రమంలో భారత రాష్ట్రపతి ద్రౌపతిముర్ము పాల్గొననున్నారు. 23న స్వర్ణ రథోత్సవంలో సత్యసాయి చిత్రపటాన్ని ఉంచి ఊరేగించనున్నారు. సాయంత్రం జోల మహోత్సవం 23వ తేదీన రాత్రికి సత్యసాయి జయంతి వేడుకలు ముగుస్తాయి.

గోల్డ్‌లోన్‌లో గోల్‌మాల్..!

◆ హిందూపురంలో 'కీర్తన గోల్డ్‌లోన్' మాయ
◆ రెన్యూవల్ చేసినా బంగారు ఆభరణాలు వేలం
◆ అన్యాయాన్ని నిరసిస్తూ బాధితుని ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలోని ధనలక్ష్మి రోడ్డులో ఉన్న కీర్తన గోల్డ్ లోన్‌లో అవసరం కోసం తాకట్టు పెట్టిన బంగారంలో గోల్‌మాల్ జరిగిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అన్యాయాన్ని నిరసిస్తూ పట్టణంలో కంసలపేటలో నివాసం ఉంటున్న చిన్న ఆచారి కీర్తన గోల్డ్ లోన్‌కార్యాలయం వద్ద శుక్రవారం ఉదయం ఆత్మహత్యకు యత్నించారు. బాధితుడు తెలిపిన మేరకు ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... చిన్న ఆచారి ఆర్థిక అవసరాల నిమిత్తం తన భార్య బంగారు ఆభరణాలను కీర్తన గోల్డ్ లోన్‌లో తాకట్టుపెట్టి రుణాన్ని తీసుకున్నాడు. ఇందుకు సంబంధించి ప్రతి నెలా సంస్థకు చెల్లించాల్సిన వడ్డీని క్రమంతప్పకుండా చెల్లించాడు. ఈ సంవత్సరం ఏప్రిల్ 8వ తేదీన తన బంధువులకు సంబంధించిన సుమారు రూ.రెండు లక్షలు విలువజేసే బంగారు నగలను కీర్తన గోల్డ్‌లోన్‌లో తాకట్టు పెట్టి రూ.1.16 లక్షలు రుణం తీసుకున్నాడు. దీనికి సంబంధించి ఇదే సంవత్సరం జులై 27వ తేదీన వడ్డీ చెల్లించి, రుణాన్ని రెన్యువల్ చేశాడు. అయినప్పటికీ కీర్తన గోల్డ్ లోన్ కార్యాలయ సిబ్బంది సెప్టెంబర్ 9వ తేదీన అసలు, వడ్డీ మొత్తం రూ.1.42లక్షలు చెల్లించాలని, లేని పక్షంలో బహిరంగ వేలం వేస్తామని నోటీసు పంపారు. నోటీసు తీసుకున్న బాధితుడు కాస్తా గడువు ఇవ్వాలని కార్యాలయ సిబ్బందితో అడిగాడు. ఆ సమయంలో నామమాత్రంగానే నోటీసు ఇచ్చామని, మీ ఆభరణాలు ఎక్కడికీ పోవని చెప్పారు. అసలు, వడ్డీ చెల్లించి తీసుకెళ్లాలని అక్కడ విధులు నిర్వహించే సిబ్బంది చెప్పారు. ఈ నేపథ్యంలో గత నాలుగు రోజులుగా తాకట్టు పెట్టిన నగలను విడిపించుకునేందుకు చిన్నఆచారి కీర్తనగోల్డ్ లోన్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాడు. నాలుగు రోజులుగా ఎవరూ స్పందించకపోవడంతో గట్టిగా నిలదీశాడు. దీంతో అసలు విషయం బయటకు వచ్చింది. ఇతనితో పాటు హిందూపురం ప్రాంతంలో మరో 144 మందికి చెందిన బంగారు ఆభారణాలను సెప్టంబర్ 30వ తేదీన విజయవాడలో బహిరంగ వేలం వేసినట్లు స్థానిక కార్యాలయంలో విధులు నిర్వహించే మేనేజర్ సౌజన్య తెలియజేసింది. దీంతో చిన్న ఆచారి ఒక్కసారిగా తీవ్ర ఆందోళనకు గురయ్యాడు. తనకు న్యాయం చేయాలంటూ కిరోసిన్‌మీద పోసుకుని కార్యాలయం వద్దనే ఆత్మహత్యకు యత్నించాడు. నిర్ణీత సమయంలోనే వడ్డీ చెల్లించి రెన్యూవల్ చేసినా, ఎలా వేలం వేస్తారంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తన ఆభరణాలు తనకు ఇవ్వకుంటే ఆత్మహత్య చేసుకుంటానని హెచ్చరించాడు. వెంటనే సిబ్బంది స్పందించి న్యాయం చేస్తామని, అతన్ని కార్యాలయంలోకి పిలుచుకున్నారు. ఈ విషయం కాస్తా పోలీసులకు తెలవడంతో వారు అక్కడికి చేరుకున్నారు. ఆందోళన చేస్తున్న చిన్న ఆచారికి న్యాయం చేస్తామని, స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. దీంతో చిన్న ఆచారి స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాడు. గత వారం నుంచి మరికొంత మంది బంగారు ఆభరణాలను విడిపించుకునేందుకు కీర్తన గోల్డ్‌లోన్ చుట్టూ తిరుగుతున్నారు. వీరిలో ఎవరి ఆభరణాలు ఉన్నాయి.. ఎవరివి వేలం వేశారన్న దానిపై ఎవరూ స్పష్టత ఇవ్వడం లేదు. దీనిపై పోలీసులు విచారణ చేపట్టి వాస్తవాలు బయటకు తేవాలని బాధితులు కోరుతున్నారు.

కీర్తన గోల్డ్ లోన్ కార్యాలయం ముందు ఆత్యహత్యాయత్నంకు పాల్పడుతున్న బాధితుడు

పోలీసులకు శరీరదృఢత్వం అవసరం : ఎస్పీ

పోలీసు పరేడ్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

పోలీసులు శరీర దఢత్వాన్ని మెరుగు పరుచుకున్నప్పుడే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని, ఇది పోలీస్ వ్యవస్థకు ఎంతో ముఖ్యమైనదని ఎస్పీ ఎస్‌వి.మాధవరెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రం పుట్టపర్తిలోని స్థానిక పోలీసు పరేడ్ మైదానం నందు శుక్రవారం ఎఆర్ సాయుధ బలగాలు, స్పెషల్ పార్టీ సిబ్బంది, హోంగార్డ్ సిబ్బంది, పుట్టపర్తి అర్బన్, రూరల్ స్టేషన్ పరిధిలోని పోలీస్ సిబ్బందితో పరేడ్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎస్పీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరేడ్ అనేది క్రమశిక్షణకు నిదర్శనం అన్నారు. పోలీస్ సిబ్బంది విధి నిర్వహణలో పరేడ్‌కు ఎంతో అవస్యకత ఉందన్నారు. సిబ్బంది విధి నిర్వహణలో తమ నైపుణ్యాలను మెరుగు పరుచుకుంటారని, పరేడ్ కార్యక్రమం సిబ్బంది అందరినీ సమైక్యంగా చేస్తూ సమిష్టి విధి నిర్వహణకు తోడ్పడుతుందన్నారు. సిబ్బంది అందరూ నెలలో కనీసం రెండుసార్లు అయినా పరేడ్‌లో పాల్గొనేలా ప్రతి సిబ్బంది అలవర్చుకోవాలన్నారు. చిన్న అవాంతరాలు ఎదురైనా సిబ్బంది అందరూ కూడా ఎంతో అద్భుతంగా పరేడ్ నిర్వహిస్తున్నారని, అలాగే పరేడ్‌లో పాల్గొన్న మహిళ సిబ్బందిని, బ్యాండ్ సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. జిల్లా పోలీసులు అందరూ ఆరోగ్యం పట్ల పూర్తి జాగ్రత్తలు తీసుకోవాని, ఆరోగ్యం మెరుగదల కోసం ప్రతిరోజూ గ్రౌండు, ప్రాక్టీస్ మరవద్దని ఎస్పీ సూచించారు. సిబ్బందికి ఏ కష్టం వచ్చినా, విధుల్లో లేదా ఇతర విషయాల్లో ఏవైనా సమస్యలు ఉంటే నా దష్టికి తీసుకురావాలన్నారు. సిబ్బంది సంక్షేమానికే మొదటి ప్రాధాన్యత ఇస్తానని, సిబ్బందికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని ఎస్పీ తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఎఆర్‌డిఎస్ పి.విజయ్ కుమార్, ఆర్ఐలు టైటస్ నారాయణ, రాజశేఖర్ రెడ్డి, అర్ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యత

మీడియా అకాడమీ ఛైర్మన్ కొమ్మినేని శ్రీనివాస్ రావు



సమావేశంలో మాట్లాడుతున్న కొమ్మినేని శ్రీనివాస్ రావు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యతను ఇస్తూ పాలన సాగిస్తోందని మీడియా అకాడమీ ఛైర్మన్ కొమ్మినేని శ్రీనివాస్‌రావు తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్లో ఆయన మీడియా ప్రతినిధు లతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను 99 శాతం నిర్వహించిందన్నారు. సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలను ప్రజల ముంగిటకే ప్రభుత్వం తీసుకొస్తోందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు చేయూతను అందించే విధంగా పథకాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ ఆవుటాల రమణారెడ్డి, డిపిఆర్‌ఒ వేళాయుధం, మీడియా అకాడమీ ఒఎస్‌పి శ్రీనివాస్, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

పాత్రికేయుల ప్రశ్నలకు జవాబు ఇవ్వని శ్రీనివాసరావు

పాత్రికేయ రంగం గురించి రాష్ట్ర ప్రెస్ అకాడమీ ఛైర్మన్‌గా కొమ్మినేని శ్రీనివాస్ రావు పాత్రికేయులు అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానం ఇవ్వకుండా దాటవేశారు. అప్పటికే సమయం ఎక్కువైందని ఆయన సమావేశంలో లేచి నిలబడటం అసహనం వ్యక్తం చేయడం జరిగింది. ఈ సందర్భంగా పాత్రికేయులకు ప్రభుత్వం ఇస్తామంటున్న ఇంటి స్థలాలలో 40 శాతం పాత్రికేయులే భరించాలని నిబంధనలు పెట్టడం సరైనది కాదన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దష్టికి తీసుకుపోవాలని డిమాండ్ చేశారు. రైతు భరోసా ద్వారా విత్తనాలు ఎరువులు పంపిణీ చేస్తున్నామని చెప్పడమే కానీ కరువు జిల్లాలో ఎక్కడ పంపిణీ జరగలేదని పాత్రికేయులు వారి దష్టికి తీసుకువచ్చారు. వర్షాభావ పరిస్థితుల్లో ఈ జిల్లాలో 80 శాతం మంది రైతులు పంటలు పెట్టలేకపోయారన్నారు. మరి రైతు భరోసా కు వచ్చిన విత్తనాలు ఎరువులు ఎక్కడ పోయాయని ప్రశ్నించగా ఆయన వీటికి సమాధానం ఇవ్వకుండా ఆయన వెళ్లిపోయారు.

టిడిపి హయాంలోనే బిసిల అభివృద్ధి

మడకశిర : టిడిపి హయాంలో బిసిల అభివృద్ధికి విశేష కృషి చేశారని టిడిపి కుంచిటి వక్కలిగ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ వి.ఎం.పాండురంగప్ప పేర్కొన్నారు. సమితి హిందూపురం పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షులు బిఎల్ఆర్.వీరకేతారాయ అధ్యక్షతన రొళ్లలోని శివాలయంలో శుక్రవారం బిసిల పోరుబాట కార్యక్రమం నిర్వహించారు. పాండురంగప్ప మాట్లాడుతూ ఎన్టీఆర్ స్థానిక సంస్థల్లో బిసిలకు 24 శాతం రిజర్వేషన్ కల్పించగా, చంద్రబాబు 34 శాతానికి పెంచారన్నారు. ప్రస్తుత జగన్ ప్రభుత్వం 10 శాతం రిజర్వేషన్లు తగ్గించడంతో రాష్ట్రవ్యాప్తంగా 16,800 మంది రాజ్యాధికారం కోల్పోయారన్నారు. బిసి సబ్ ప్లాన్ నుంచి రూ. 75 వేల కోట్లు దారి మళ్లించి బిసికు చాలా ద్రోహం చేశారని మండిపడ్డారు. బిసిలపై దాడులు, దౌర్జన్యాలు చేయడంతో పాటు అక్రమ కేసులు బనాయించి వేధిస్తున్నారన్నారు. కావున రాబోయే రోజుల్లో బిసిలందరూ ఏకతాటిపైకి వచ్చి వైసిపి ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచి సన్న మారేగౌడ్, రామన్న, రామచంద్రప్ప, రవికుమార్, బి.నారాయణప్ప, శివకుమార్, కరేగౌడ్, బోజేగౌడ్, రంగనాథప్ప, రాజన్న, నాగరాజు, జిబి.హళ్లి నాగరాజ, ఆదెప్ప, హనుమంతరాయప్ప, కెంపన్న, నాగేంద్ర, కాంతరాజు, బండి రమేష్ తదితరులుపాల్గొన్నారు.

బాలికల భద్రత సామాజిక బాధ్యత

అగళి : బాలికల భద్రత సామాజిక బాధ్యత అని వక్తలు పేర్కొన్నారు. స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాల యలో శుక్రవారం ఆర్‌డిటి, మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సెక్టార్ టీం లీడర్ ఆదినారాయణ అధ్యక్షతన బాలల హక్కుల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఆర్‌డిటి మడకశిర రీజినల్ డైరెక్టర్ మల్లికార్జున, ఎంపిపి రేణుక, డిప్యూటీ తహశీల్దార్ సుబ్బారావు, ఎంఇఒ చంద్రశేఖర్‌నాయుడు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ లీలావతి హాజరయ్యారు. ముందుగా చిన్నారులకు లఘు చిత్రాల ద్వారా ప్రస్తుత సమాజంలో ఎదురవుతున్న సమస్యల(బాల్య వివాహాలు, లైంగిక వేధింపులు)ను ఎలా ఎదుర్కోవాలి అనే విషయాలను తెలిపారు. చిన్నారులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. వక్తలు మాట్లాడుతూ బాలల హక్కుల ను పరిరక్షించడం అందరి లక్ష్యం కావాలని పిలుపునిచ్చారు. ఆర్‌డిటి సంస్థ కర్నాటక సరిహద్దు మండలాల్లో ప్రభుత్వ శాఖల సమన్వయంతో బాలల హక్కుల పరిరక్షణ కోసం ఎంతో కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఆర్‌డిటి ఏరియా టీం లీడర్ ఓబులేసు, కెజిబివి, ఆర్‌డిటి సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జెఎన్‌టియులో సాంస్కృతిక సంబరం

ప్రజాశక్తి -అనంతపురం

అనంతపురం జెఎన్‌టియులో సాంస్కృతిక సంబరం శుక్రవారం నాడు అట్టహాసంగా ప్రారంభం అయ్యింది. ఆర్ట్స్, కల్చరల్ ఫెస్ట్-2023(ఉత్సవ్) పేరుతో నిర్వహిస్తున్న ఈకార్యక్రమాన్ని విసి రంగజనార్ధన ప్రారంభించారు. ఎన్‌టిఆర్ ఆడిటోరియంలో రెండు రోజుల పాటు ఈ కార్యక్రమం జరగనుంది. విద్యార్థులు డ్యాన్సులు, పాటలు, మిమిక్రీ, ప్యాషన్‌షో, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. విద్యార్థుల ప్రదర్శనలను ఆహుతలను కట్టిపడేశాయి. జెఎన్‌టియు పులివెందుల ఇంజినీరింగ్ కళాశాల, జెఎన్‌టియు కలికిరి ఇంజినీరింగ్ కళాశాల, ఎంబీఏ విభాగం, ఓటీపీఆర్ఐ కళాశాలల నుంచి 550 మంది విద్యార్థులు ఈ ప్రదర్శనలో పాల్గొనను న్నారు. విద్యార్థులు కొత్త కొత్త ఆలోచనలు, ఆవిష్కరణలకు నాంది పలకాలని విసి రంగజనార్ధన్ పిలుపు నిచ్చారు. విద్యార్థులు వారికి ఇష్టమైన రంగాన్ని ఎంచుకుని జీవితంలో స్థిరపడాలని సూచించారు.బ రిజిస్ట్రార్ సి.శశిధర్ మాట్లాడుతూ విద్యార్థులు పోటీ తత్వం కలిగి ఉండాలన్నారు. సాంస్కృతిక కార్యక్ర మాల్లోనూ విద్యార్థులు పాల్గొని వారిలో ఉన్న నైపుణ్యతను చాటాలని తెలిపారు.

కరువు నివారణ చర్యలు చేపట్టాలి : ఒపిడిఆర్

ప్రజాశక్తి-కదిరి టౌన్

ఉమ్మడి అనంతపురం జిల్లాలో రైతుల ఆత్మహత్యలను ఆపేందుకు కరువు నివారణ చర్యలు చేపట్టాలని ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ(ఒపిడిఆర్) జాతీయ ఛైర్మన్ భాస్కర్‌రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఒపిడిఆర్ రాష్ట్ర, ఉమ్మడి అనంతపురం జిల్లా కమిటీలు కదిరి, ఒడిసి, అమడగూరు, తనకల్లు, నల్లచెరువు మండలాల్లో పూర్తిస్థాయిలో పర్యటించి కరువు పరిస్థితులను అధ్యయనం చేశాయి. ఈ బృందం రైతులు, రైతు కూలీలను కలిసి క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించారు. అనంతరం వారు శుక్రవారం పట్టణంలోని రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ రైతులు విత్తనం వేసినా వర్షాభావ పరిస్థితులతో పంట చేతికందక, కూలీల ధరలు చెల్లించలేక పంటలను తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు అన్నారు. కరువు నెలకొనడంతో ప్రతి గ్రామంలో 50 కుటుంబాలు వలస వెళ్లినట్లు అధ్యయనంలో తేలిందన్నారు. ప్రభుత్వం వెంటనే కరువు, వలసల నివారణ కోసం పటిష్ట చర్యలు చేపట్టాలని, ఉపాధి పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. అధ్యయనంలోని అంశాలను నివేదిక ద్వారా ప్రభుత్వాలకు అందజేస్తామన్నారు.

ఆర్థికసాయం అందజేస్తున్న బాల్య స్నేహితులు

బాల్య స్నేహితుడి కుటుంబానికి చేయూత

ముదిగుబ్బ : స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో 1984-85లో పదో తరగతి చదువుకున్న చంద్ర ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. చంద్ర డ్రైవర్‌గా పని చేస్తూ భార్య, పిల్లలను పోషించుకునేవాడు. చంద్ర బాల్య స్నేహితులు తోటి మిత్రులతో రూ. 36,500 పోగుచేసి అతడి భార్య అలివేలమ్మకు అంద జేశారు. కార్యక్రమంలో ప్రకాశ్, మల్లగుండ్ల భాస్కర్, నారాయణస్వామి, నాయుడు పాల్గొన్నారు.

ఎక్స్‌ప్రెస్ రైలు ఆపాలని వినతి

ముదిగుబ్బ : స్థానిక స్టేషన్‌లో హైదరాబాద్ వెళ్లే అన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపాలని కోరుతూ శుక్రవారం మండల అఖిలపక్ష నాయకులతో పాటు మానవ హక్కుల సంఘం అధ్యక్షులు ముదిగుబ్బ రైల్వే స్టేషన్ మాస్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు, మానవ హక్కుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు వెంగమేష్‌చౌదరి, జిల్లా యువజన అధ్యక్షులు షేక్‌దాదు, వైసిపి నాయకులు మల్లగుండ్ల భాస్కర్, కసిరెడ్డి కృష్ణారెడ్డి, భాషా, టిడిపి నాయకులు లింగుట్ల వెంకటరాముడు, కృష్ణమూర్తి యాదవ్, తుమ్మల సూరి, సురేష్, జనసేన పార్టీ నాయకులు రెడ్డప్ప, ఆర్యవైశ్య సంఘం యువజన నాయకులు మహేష్, వైద్యాధికారి కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

19న కార్తీక వనభోజనాలు

ధర్మవరం టౌన్ : ఈ నెల 19వ తేదీ నాగలూరు వద్ద ఉన్న ఓ తోటలో నిర్వహిస్తున్న కార్తీక వనభోజన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యోగా గురువు గొర్ల నారాయణరెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలోని మార్కెట్ యార్డులో యోగా సాధకులు వనభోజనాల పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో యోగా సాధకులు రామకృష్ణనాయక్, నల్లపరెడ్డి, నారాయణస్వామి, శ్రీనానాయక్, బాబ్‌జాన్, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాసులు, చంద్రశేఖర్, నవశంకర్, ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

19న ఆర్యవైశ్య సంఘం సమావేశం

ధర్మవరం టౌన్ : ఈ నెల 19వ తేదీ పుట్టపర్తిలోని శ్రీవాసవీ నివాసంలో నిర్వహించే ఆర్యవైశ్య సంఘం సమావేశానికి పట్టణ, మండల అధ్యక్షులు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షులు కలవల రాంకుమార్ పిలుపునిచ్చారు. పట్టణంలోని తన నివాసంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆర్యవైశ మహాసభ ఆదేశాలకు అనుగుణంగా ఎన్నికలు నిర్వహిస్తున్నామన్నారు.

అంత్యక్రియలకు ఆర్థికసాయం

నల్లచెరువు : నల్లచెరువు సహకార సంఘం కార్యాలయ వాచ్‌మేన్ తలారి రామాంజనేయులు గురువారం మృతి చెందాడు. సమాచారం అందుకున్న సహకార సంఘం అధ్యక్షుడు జయచంద్రారెడ్డి శుక్రవారం ఆయన మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అతడి భార్యకు అంత్యక్రియల నిమిత్తం రూ. 8వేలు అందజేశారు. నివాళులర్పించిన వారిలో సింగిల్ విండో డైరెక్టర్లు చంద్రశేఖర్‌రెడ్డి, ఆదిమూర్తి, వైసిపి నాయకులు దశరథరామయ్యానాయుడు, ఎంపిటిసిలు రామాంజనేయులు, కోనపల్లి నరసింహారెడ్డి, సహకార సంఘం సిబ్బంది లక్ష్మీపతినాయుడు, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

పాలెం సుధాకర్ దాతృత్వం

నల్లచెరువు : మండల పరిధిలోని అల్లుగుండు బస్‌షెల్టర్‌లో కాలం గడుపుతూ ఉండడానికి ఇల్లు లేక, తినడానికి తిండి లేక జీవిస్తున్న వెంకటరమణ దంపతులకు శుక్రవారం కదిరి నియోజవర్గ వైసిపి నాయకు లు పాలెం సుధాకర్ నెల రోజులకు సరిపడే నిత్యావసర సరుకులు, బియ్యం, వంట సామగ్రి అందజేశారు. ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో కూడా వీరికి నిత్యావసర సరుకులు, బియ్యం పంపిణీ చేస్తానని భరోసా ఇచ్చారు.

అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ

బుక్కపట్నం : మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు శుక్రవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో వార్షిక బడ్జెట్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంఇఒ గోపాల్‌నాయక్ మాట్లాడుతూ 2024-25లో జరిగే వార్షిక బడ్జెట్, అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ ఇచ్చామన్నారు. అనంతరం ప్రధానోపాధ్యా యులు, పేరెంట్స్ కమిటీతో గ్రామసభలు నిర్వహించి పాఠశాల అభివృద్ధిపై నివేదికలు తయారు చేయాలని ఆదేశించారు. ఈ నివేదికలను ఈ నెల 25వ తేదీ లోపు ఎమ్మార్సీ కార్యాలయాలకు చేర్చాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఇఒ-2 మోహన్‌బాబు, రీసోర్స్‌పర్సన్ చంద్రశేఖర్, హెచ్‌ఎం పాల్గొన్నారు.

న్యూట్రీషియన్ కిట్లు పంపిణీ

మడకశిర : ప్రధానమంత్రి టిబి ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా శుక్రవారం పట్టణంలోని వైద్య విధాన పరిషత్‌లో పవర్ గ్రిడ్ సంస్థ ఆధ్వర్యంలో క్షయ వ్యాధిగ్రస్తులకు న్యూట్రీషియన్ కిట్లు పంపిణీ చేశారు. సూపరింటెండెంట్ డాక్టర్ శశిరేఖ మాట్లాడుతూ న్యూట్రీషియన్ కిట్లు ఉపయోగించడం వల్ల టిబి నయం చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ దివాకర్, సూపర్‌వైజర్ రాము, సాయిక్రిష్ణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

న్యూట్రీషియన్ కిట్లు పంపిణీ చేస్తున్న వైద్యసిబ్బంది

సేవాభావం అలవర్చుకోండి : ఎస్పీ

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

ప్రతి ఒక్కరూ సేవా భావంతో తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లల పట్ల ఆదరణ చూపి ఆదుకోవాలని ఎస్పీ మాధవరెడ్డి సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని ఎస్పీ ఛాంబర్‌లో శుక్రవారం వధాన్య సొసైటీ ఆధ్వర్యంలో ప్రతిభ కలిగి, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న 8 మంది పేద విద్యార్థులకు ఎస్పీ ల్యాప్ ట్యాప్‌లు అందజేశారు. ఎస్పీ మాట్లాడుతూ భవిష్యత్తులో మీరు కూడా ఉన్నతస్థాయికి ఎదిగి సమాజానికి ఉపయోగపడే పనులు చేయాలని ఆకాంక్షించారు. యువత సన్మార్గంలో పయనించాలని, ప్రణాళిక తయారు చేసుకుని క్రమశిక్షణతో ముందుకు సాగాలన్నారు. మీలో దాగి ఉన్న ప్రతిభను అందరికీ పంచాలన్నారు. పేద విద్యార్థులకు వధాన్య సొసైటీ అందిస్తున్న చేయూతను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వధాన్య సొసైటీ వ్యవస్థాపకులు అశోక్ పడపాటి, భార్గవ్, ఆర్‌ఎస్ఐ వెంకటేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ల్యాప్‌ట్యాప్‌లు పంపిణీ చేస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

పోలీసుల సంక్షేమానికి పెద్దపీట : ఎస్పీ

పోలీసులకు వృత్తిపరంగా ఎలాంటి సమస్య ఉన్నా తన దృష్టి తెస్తే పరిష్కారం చూపుతామని ఎస్పీ మాధవరెడ్డి భరోసా ఇచ్చారు. పట్టణంలోని పోలీసు పరేడ్ మైదానంలో శుక్రవారం ఎస్పీ 'పోలీస్ దర్బార్' నిర్వహించారు. ఎస్పీ సిబ్బంది సమస్యలు తెలుసుకొని వీలైనంత త్వరగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అందరూ క్రమశిక్షణతో విధులు నిర్వర్తిస్తూ జిల్లా పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఎఆర్ డీఎస్పీ విజయ్‌కుమార్, ఆర్‌ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

జగన్ హయాంలో జనరంజక పాలన

ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

సిఎం జగన్ జనరంజకమైన పాలన చేస్తూ సంక్షేమం, అభివృద్ధిని సమపాళ్లలో అందిస్తున్నారని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఎమ్మెల్యే పట్టణంలోని 5వ వార్డులో ఇంటింటికీ వెళ్లి సంక్షేమం, అభివృద్ధి గురించి వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో 14వేల మందికి పైగా పేదలకు ఇంటిస్థలాలు కేటాయించి గృహ నిర్మాణ సౌకర్యం కల్పిస్తామన్నారు. ఇంటి స్థలం పొందిన పేదలు త్వరితగతిన ఇళ్లు నిర్మించుకోవాలన్నారు. అనంతరం సచివాలయాన్ని సందర్శించి అర్హతే ప్రామాణికంగా ప్రజలకు సంక్షేమ పథకాలు అందించేలా సచివాలయ సిబ్బంది, వార్డు వాలంటీర్లు పని చేయాలని, చిన్న ఆరోపణ వచ్చినా ఉపేక్షించేది లేదన్నారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, వైస్‌ఛైర్మన్ వేముల జయరామిరెడ్డి, ట్రాన్స్‌కో ఎడి కొండా రెడ్డి, మున్సిపల్ ఎఇ హరీష్, హౌసింగ్ ఎఇ బాలాజీ, కౌన్సిలర్లు, వైసిపి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి

ఘనంగా సహకార వారోత్సవాలు

ప్రజాశక్తి-సోమందేపల్లి

స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయంలో శుక్రవారం సింగిల్‌విండో అధ్యక్షులు మాగేచెరువు కొల్లప్ప అధ్యక్షతన 70వ వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సిఇఒ జయరాములు, బండ్లపల్లి ఫ్యాక్స్ సిఇఒ రామాంజనేయులు హాజరై మాట్లాడారు. ప్రాథమిక వ్యవసాయ సహకార పరిమితి సంఘం ఈ 70 ఏళ్లలో రైతులకు ఎనలేని సేవలు అందించిందని, సహకార సంఘాల సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం నల్లగొండ్రాయనపల్లి, గుడిపల్లి గ్రామాల్లో రాగులు కొనుగోలు ప్రక్రియను ప్రారంభించారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరతో రెండు గ్రామాల్లో రైతుల నుంచి 3 క్వింటాళ్ల రాగులు సేకరించామని కొల్లప్ప తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్స్ నర్సింహులు, నాగమ్మ, సిబ్బంది మధు, సుదర్శన్‌రెడ్డి, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో శుక్రవారం వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా ఏటా నవంబర్ 14 నుంచి 20వ తేదీ వరకు వారోత్సవాలు నిర్వహిస్తామన్నారు. సంఘాలు కేవలం క్రెడిట్ బిజినెస్ మాత్రమే కాకుండా నాన్ క్రెడిట్ బిజినెస్ అయిన ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్, విత్తనాలు, గ్యాస్ ఏజెన్సీ, తదితరాలు ఏర్పాటు చేసుకొని సంఘం అభివృద్ధికి పాటుపడా లని సూచించారు. కార్యక్రమంలో సబ్ డివిజనల్ కోఆపరేటివ్ ఆఫీసర్ ప్రభాకర్‌నాయక్, సీనియర్ ఇన్‌స్పెక్టర్ మురళీమోహన్, ఎడిసిసి బ్యాంక్ మేనేజర్ టి.గోపాల్, అసిస్టెంట్ మేనేజర్లు వెంకటరమణమ్మ, కీర్తి, సాగర్, ముదిగుబ్బ రాళ్లఅనంతపురం సిఇఒలు శ్రీనివాసులు, మహేష్‌బాబు, సంఘం సిబ్బంది వైకుంఠ వాసరెడ్డి, మౌలా సాహెబ్, రైతులు పాల్గొన్నారు.

సోమందేపల్లి నెహ్రూ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిఇఒ జయరాములు, తదితరులు

మాట్లాడుతున్న శ్రీసాయి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ చాంద్‌బాషా, నృత్యం చేస్తున్న విద్యార్థినులు

విద్యతోనే భవిష్యత్తుకు పునాది

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

విద్యతోనే భవిష్యత్తుకు పునాది అని శ్రీసాయి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ చాంద్‌బాషా పేర్కొన్నారు. స్థానిక దేవాంగం కల్యాణ మండపంలో శుక్రవారం కళావాల విద్యార్థులతో ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ముఖ్యఅతిథి చాంద్‌బాషా మాట్లాడుతూ తమ విద్యార్థులు ఎంతోమంది ఉన్నతస్థాయికి చేరుకున్నారన్నారు. ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులు కూడా తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెట్టేలా ఇష్టపడి చదివి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. చివరగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఫణికుమార్, డైరెక్టర్లు పోలా ప్రభాకర్, బండ్లపల్లి రంగనాథ్, డాక్టర్ సుబ్బారావు, రమణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

వడ్డెర్లను ఆదుకోవాలని కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

వడ్డెర్లు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎదగడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఉమ్మడి అనంతపురం జిల్లా వడ్డెర సంఘం అధ్యక్షుడు మల్లెల జయరాం డిమాండ్ చేశారు. వడ్డెర్ల స్థితిగతులపై శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ పి.అరుణ్‌బాబుకు వినతిపత్రం సమర్పించారు. జయరాం మాట్లాడుతూ క్వారీ లీజుల్లో 20 శాతం రాయితీ, ప్రభుత్వ కాంట్రాక్టు పనుల్లో ఇఎండి రుసుము లేకుండా రాయితీ కల్పించాలని, 70 శాతం సబ్సిడీపై పనిముట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. రాబోయే ఎన్నికల్లో వడ్డెర్లకు ఉమ్మడి జిల్లాలో రెండు ఎమ్మెల్యే, ఒక ఎంపి స్థానం కేటాయించాలని కోరారు. ఈ విషయాన్ని టిడిపి అధినేత చంద్రబాబు దృష్టికి తీసుకుపోగా సానుకూలంగా స్పందించామన్నారు. వడ్డెర్లు విభేదాలు వీడి ఐకమత్యంతో పని చేసి వడ్డెర్లను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. వినతి ఇచ్చిన వారిలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గోవిందరాజులు, వర్కింగ్ ప్రెసిడెంట్ హనుమన్న, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న శాశ్వత భూహక్కు పత్రాలు పంపిణీ

కదిరి టౌన్ : రూరల్ మండల పరిధిలోని కదిరి కుంట్లపల్లి పంచాయతీ ఆలంపూర్‌లో శుక్రవారం ఎంపిడిఒ అంజనప్ప 115 మంది లబ్ధిదారులకు 'జగనన్న శాశ్వత భూ హక్కు-గృహ హక్కు పథకం' యాజమాన్య హక్కు పత్రాలను పంపిణీ చేశారు. ఎంపిడిఒ మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేసిన ఈ పత్రాలను ప్రజలు బ్యాంకులో తనఖా పెట్టి రుణం పొందవచ్చునని తెలిపారు. ఈ పథకం ద్వారా ఆస్తిపై ప్రజలు సంపూర్ణ అధికారం, హక్కు కలిగి ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ సునీత, సర్పంచి రజనీష్‌రెడ్డి, ఎంపిటిసి కుమార్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి, విఆర్‌ఒ జగన్‌మోహన్ రెడ్డి, సచివాలయం సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా కవి సమ్మేళనం

ధర్మవరం టౌన్ : పట్టణంలోని బాబుజగ్జీవన్‌రామ్ నగర్‌లో ఉన్న ప్రధాన పౌర శాఖ గ్రంథాలయంలో శుక్రవారం కవి సమ్మేళనం ఘనంగా నిర్వహించామని గ్రంథాలయ అధికారిని అంజలి సౌభాగ్యవతి, విశ్రాంత హెచ్‌ఎం ముత్యాల ప్రసాద్ తెలిపారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా 4వ రోజు విద్యార్థులు పద్యాలు, గేయాలు, కవితలు చెప్పారు. వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సమయాన్ని వథా చేయకుండా, పుస్తకాలు చదివి విజ్ఞానం పెంపొందించు కోవాలన్నారు. వక్తృత్వ పోటీలు నిర్వహించగా 75 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో నాగరాజు, గ్రంథాలయ సిబ్బంది రమణనాయక్, శివమ్మ, గంగాధర్, ముకుంద, శివ, గంగాధర్, జిలాన్‌బాషా, పాఠకులు పాల్గొన్నారు.

ఎపి ప్రెస్ అకాడమీ ఛైర్మన్ శ్రీనివాసరావుకు జ్ఞాపికను అందిస్తున్న ఎమ్మెల్యే సిద్ధారెడ్డి

ప్రెస్ అకాడమీ ఛైర్మన్‌కు సన్మానం

ప్రజాశక్తి-కదిరి టౌన్

ఎపి ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు శుక్రవారం పట్టణంలో వెలసిన ఖాద్రి లక్ష్మీనరసింహస్వామి దర్శనార్థం కదిరికి వచ్చారు. స్థానిక ఆర్‌అండ్‌బి బంగ్లాలో బస చేసిన ఛైర్మన్‌ను ఎమ్మెల్యే సిద్ధారెడ్డి, స్థానిక పాత్రికేయులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేతో పాటు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు ఛైర్మన్‌కి పూలమాలలు వేసి దుశ్శాలువాలతో సన్మానించి ఖాద్రి లక్ష్మీనరసింహస్వామి చిత్రపటాన్ని బహూకరించారు. న్యాయవాదులు ప్రసాద్‌రెడ్డి, గుర్లింగస్వామి కూడా ఛైర్మన్‌ను సన్మానించారు. కార్యక్రమంలో శ్రీనివాసరెడ్డి, జయచంద్రారెడ్డి, ప్రసాద్, నరేందర్‌రెడ్డి, పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జిఒను సడలించి ప్రతి జర్నలిస్టుకు నివేశన స్థలం మంజూరు చేయాలని కోరుతూ మహాజన జర్నలిస్ట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు ఎల్లం రాజు స్థానిక రోడ్లు భవనాల శాఖ అతిథి గృహంలో ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు.

హలుకూరులో రాగి కొనుగోలు కేంద్రం

క్వింటా రూ. 3,846తో కొనుగోలు

ప్రజాశక్తి-అమరాపురం

మండల పరిధిలోని హలుకూరు రైతు భరోసా కేంద్రంలో ఏర్పాటు చేసిన రాగి పంట కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి, సివిల్ సప్లైస్ డిఎం అశ్వత్థనారాయణ నాయక్ ప్రారంభించారు. వారు మాట్లాడుతూ రైతులు పండించిన రాగి పంటను కొనుగోలు చేసేందుకు మొదటి విడతగా హలుకూరు ఆర్‌బికెలో కొనుగోలు కేంద్రం ప్రారంభించామన్నారు. క్వింటాకు కనీస మద్దతు ధర రూ. 3,846 లతో కొనుగోలు చేస్తారని, రవాణా, హమాలీ, సంచుల ఖర్చును కూడా ప్రభుత్వమే భరిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ మునిస్వామి, ఎఒ మంజునాథ్, ఎంపిపి ఈరన్న, జడ్పిటిసి సారక్క నరసింహమూర్తి, వైసిపి మండల కన్వీనర్ త్రిలోక్‌నాథ్, జెసిఎస్ కన్వీనర్ శ్రీనివాస్‌రెడ్డి, గ్రామ సర్పంచి హనుమక్క శివలింగప్ప, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

కులగణనపై అపోహలొద్దు

చిలమత్తూరు : ప్రభుత్వం చేపట్టిన 'కులగణన'కు సంబంధించి ఉద్యోగులకు శిక్షణ ఇచ్చేందుకు మాస్టర్ ట్రైనర్‌గా ఎంపిడిఒ నరేష్‌కృష్ణ నియమితులయ్యారు. జిల్లాలో ఐదుగురు మాస్టర్ ట్రైనర్లుగా నియమితులు కాగా ఈయన చిలమత్తూరుతో పాటు హిందూపురం అర్బన్, రూరల్, పరిగి మండలాలకు చెందిన సచివాలయ ఉద్యోగులకు శిక్షణ ఇస్తారు. ఎంపిడిఒ మాట్లాడుతూ కులగణన బ్రిటీష్ పరిపాలనలో ఓ సారి జరిగిందని, మళ్లీ ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం పారదర్శకంగా చేస్తోందన్నారు. దీనిపై ప్రజలెవ్వరూ అపోహలు పెంచుకోవద్దని, దీని వల్ల ఎలాంటి నష్టం వాటిల్లదని, సర్వేకు సహకరించాలని కోరారు.

సజ్జలతో బత్తల సోదరుల భేటీ

కదిరి టౌన్ : రానున్న ఎన్నికల్లో వడ్డెర్లకు రాజకీయంగా ప్రాధాన్యం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని బిసి సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ వెంకటరమణ, వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బత్తల హరిప్రసాద్ కోరారు. వారితో పాటు వడ్డెర కార్పొరేషన్ ఛైర్మన్ దేవళ్ల రేవతి, పులివెందుల మున్సిపల్ ఛైర్మన్ వల్లెపు వరప్రసాద్, మైనింగ్ డైరెక్టర్ బత్తల రామారావు, శ్రీశైల దేవస్థానం బోర్డ్ మెంబర్ తన్నీరు ధర్మరాజు, దేవల్ల వెంకట్, బత్తల నాగేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. వారు సజ్జలతో వడ్డెర్ల స్థితిగతులపై చర్చించారు. వినతిపై సజ్జల సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు.

నేటి నుంచి వైద్యశిబిరం

పుట్టపర్తి రూరల్ : శ్రీసత్యసాయి 98వ జయంతి సందర్భంగా ప్రశాంతి నిలయంలోనినార్త్ వన్ బిల్డింగ్‌లో ఈ నెల 18 నుంచి 25వ తేదీ వరకూ ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వైద్య సిబ్బంది తెలిపారు. అందులో దేశీయ, విదేశీ ఉన్నత స్థాయి వైద్య నిపుణులు సేవలు అందిస్తారన్నారు. అమెరికాకు చెందిన డాక్టర్ గీతా కామత్ నేతృత్వంలో 62 మంది వైద్యులతో కూడిన నిపుణుల బృందం ప్రతి రోజూ ఉదయం 8 నుంచి రాత్రి 9 గంటల వరకూ వైద్యసేవలు అందిస్తారన్నారు.

ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి

మడకశిర : పరిగి మండల పరిధిలోని కొడిగెనహళ్లి ప్రభుత్వ అంధుల పాఠశాలలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంట నే భర్తీ చేయాలని జాతీయ అంధుల ఫెడరేషన్ అధ్యక్షులు బి.సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి బి.నంజ ప్ప డిమాండ్ చేశారు. పట్టణంలో శుక్రవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 3 దశాబ్దాల చరిత్ర కలిగిన పాఠశాల సమస్యలతో కొట్టుమిట్టాడుతుందన్నారు. వెంటనే ఉపాధ్యాయ, సబార్డినే టర్, తదితర ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

తాగునీటి పైపులైన్ పనులకు భూమిపూజ

మడకశిర రూరల్ : జలజీవన్ మిషన్‌లో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని కల్లుమర్రి గ్రామంలో తాగునీటి పైపులైన్ పనులకు సర్పంచి గంగమ్మనాగరాజు భూమిపూజ చేసి ప్రారంభించారు. సర్పంచి మాట్లాడుతూ పైపులైన్ పనులు పూర్తయితే పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారం అవుతుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ వరదరాజు, అగ్రికల్చర్ అసిస్టెంట్ విజయ్, ఇంజినీర్ అసిస్టెంట్ వినయ్, మెంబర్స్ జంగంరెడ్డి, రమేష్, నాగభూషణం గ్రామస్తులు పాల్గొన్నారు.

అయ్యప్ప మాలధారులకు అన్నదానం

హిందూపురం : పట్టణంలోని బెంగళూరు రోడ్డులో వెలసిన అయ్యప్పస్వామి ఆలయంలో ఈ నెల 18 నుంచి జనవరి 4వ తేదీ వరకూ ప్రతి రోజూ మధ్యాహ్నం 1 నుంచి 3 గంటల వరకూ అయ్యప్ప భక్తులకు అన్నదానం చేయనున్నట్లు అన్నదానం కమిటీ అధ్యక్షులు రమేష్ కుమార్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం అన్నదాన భవన్‌లో కరపత్రాలను విడదలు చేశారు. కార్యక్రమంలో గురుస్వామి రవిఠాకూర్, కమిటీ ప్రతినిధులు శ్రీకాంత్, శ్రీరాములు, నారాయణప్ప, కొండయ్య, ఆటో సంజీవ, నరసింహులు, వెంకటేష్, శ్రీరాములు, నాగేంద్ర, వాసు, చౌదరి, సుబ్రమణ్యం, అర్చకులు పవన్ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

బత్తలపల్లి : తాడిమర్రి మండల పరిధిలోని పెద్దకోట్ల గ్రామ పొలాల్లో కొండ ప్రాంతంలో శుక్రవారం పోలీసులు గుర్తు తెలియని మృతదేహాన్ని గుర్తించారు. ఎస్ఐ నాగసామి తెలిపిన వివరాల మేరకు.. అతడి వయస్సు 50 నుంచి 60 ఏళ్ల లోపు ఉండవచ్చని, సుమారు 20 నుంచి 30 రోజుల క్రితం మృతిచెంది ఉంటాడని తెలిపారు. మీసాలు తెల్లగా పొడవుగా ఉన్నాయని, మృతదేహం వద్ద ఆకుపచ్చ, నలుపు రంగు సోలాపూర్ దుప్పటి, తెల్లని ఆకుపచ్చ చేతి సంచి, పరిసర ప్రాంతాల్లో కరెన్సీ నోట్లు, చిల్లర నాణెలు పడి ఉన్నాయన్నారు. ఇతను భిక్షాటన చేస్తుండే వాడని తెలుస్తోంది. ఇతడి వివరాలు తెలిసిన వారు ముదిగుబ్బ సిఐ 92811 07077, తాడిమర్రి ఎస్ఐ 94409 01893కి సమాచారం ఇవ్వాలని కోరారు.

అత్యాచారం కేసులో నిందితుడికి రిమాండ్

పరిగి : పరిగి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ గ్రామానికి చెందిన బాలికపై మేనమామ అయిన ఎరుకల తిప్పేస్వామి అత్యాచారానికి పాల్పడినట్లు ఈ నెల 10వ తేదీ బాలిక తల్లి ఫిర్యాదు చేసింది. ఎస్ఐ నరేంద్ర పోక్సో కేసు నమోదు చేసి నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. పరారీలో ఉన్న తిప్పే స్వామిని శుక్రవారం ఉదయం సేవామందిర్ క్రాస్ వద్ద దర్యాప్తు అధికారి పెను కొండ డీఎస్పీ హుస్సేన్ పీరా, ఎస్ఐ, సిబ్బందితో కలిసి అరెస్ట్ చేశారు. కోర్టులో హాజరు పరచగా జడ్జి నిందితుడికి 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ముదిగుబ్బ : స్థానిక పాతఊరు ఆంజనేయస్వామి గుడి వద్ద శుక్రవారం బొలెరో ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న సంఘటనలో ఇద్దరు గాయపడ్డారు. వెంగముని, నారాయణమ్మ ద్వి చక్ర వాహనంపై వెళ్తుండగా బొలెరో ఢీ కొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. వారిని తలుపుల 108 వాహనంలో ఆసుపత్రికి తరలించారు.

న్యాయవాది మృతికి బార్ అసోసియేషన్ సంతాపం

మాధవయ్య(ఫైల్‌ఫొటో)

హిందూపురం : పట్టణంలో నివాసం ఉంటూ స్థానిక కోర్టులో న్యాయవాదిగా విధులు నిర్వహిస్తున్న మాధవయ్య(53) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలిసిన వెంటనే బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, హితయతుల్లా మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన భార్య, కుమారుడిని పరామర్శించారు. వారితో పాటు ఎపిపి ఇందాద్, సీనియర్ న్యాయవాదులు రామచాంద్రారెడ్డి, సిద్దా, తదితరులు ఉన్నారు.

జనసేనలో పలువురు చేరిక

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణంలోని 29వ వార్డు సుందరయ్యనగర్, సత్యసాయినగర్‌కు చెందిన 10 కుటుంబాలు శుక్రవారం జనసేనపార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి ఇంటిలో జనసేన పార్టీలో చేరాయి. పవన్ కల్యాణ్ సిద్ధాంతాలు నచ్చి పార్టీ పార్టీలో చేరామని కన్నపనేని రాజేశ్, గంతిమేరి నారాయణ స్వామి, గూడూరు నరేశ్, సాకే ఓబులేసు, కొవూరు దిలీప్‌కుమార్, గొర్రె కేద్రీపాథ్, గంతిమేరి బాబు తెలిపారు. వారికి చిలకం పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. చిలకం మాట్లాడుతూ పార్టీలోకి చేరిన ప్రతి ఒక్కరికీ ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఏ కార్యకర్త ఆపదలో ఉన్నా అందుబాటులో ఉంటూ ఆదుకుంటానన్నారు. పార్టీ బలోపేతానికి సైనికుల్లా పని చేయాలన్నారు. కార్యక్రమంలో తలారి ప్రతాప్, కుల్లంపల్లి రమేశ్, మురెప్పగారి శంకర్‌నాయుడు, నారాయణస్వామి పాల్గొన్నారు.

చిలకం సమక్షంలో జనసేన పార్టీలో చేరిన వైసిపి కార్యకర్తలు

'గుండుమల'పై ఎమ్మెల్యే అనుచిత వ్యాఖ్యలు తగదు

మడకశిర రూరల్ : నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామిపై ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని టిడిపి ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మంజునాథ్ తెలిపారు. పట్టణంలోని టిడిపి కార్యాలయం వద్ద శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గతంలో ఈరన్నని ఎమ్మెల్యేగా అనర్హుడుగా చేసింది, ఆయనతో చేతులు కలిపి మా పార్టీలో జీరో చేసింది నీవు కాదా అని ప్రశ్నించారు. బిసిలు, మైనార్టీలు, దళితుల మీద కేసులు పెట్టించింది, దాడులు చేసిందెవరో ప్రజలంద రికీ తెలుసన్నారు. నాపై అక్రమ కేసులు బనాయించినప్పుడు దళితులు గుర్తుకు రాలేదా అని నిలదీశారు. రాబోయే ఎన్నికల్లో గుండుమల తిప్పేస్వామిని ఎదుర్కొనే దమ్ములేక ఆరోపణలు చేయడం తగదని, ఇకకనైనా అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలని హితవు పలికారు.

డిఎల్‌ఆర్ కాలనీలో సమస్యలపై కమిషనర్‌కు వినతి

ధర్మవరం టౌన్ : పట్టణంలోని 29వ వార్డు డిఎస్‌ఆర్ కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం కాలనీ వాసులు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్నకు వినతి పత్రం అందజేశారు. రాజు, దుస్సా కృష్ణ, దస్తగిరి, రాప్తాటి రాము, నబిరసూల్, నారాయణస్వామియాదవ్, గంధమనేని నారాయణస్వామి, హరి మాట్లాడుతూ డిఎస్‌ఆర్ కాలనీలో తాగునీటి సమస్యతో పాటు మౌలిక వసతులు కల్పించాలని విన్నవించారు. కాలనీ ప్రజలు పన్నులు చెల్లిస్తున్నా మౌలికవసతులు కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన కమిషనర్ మౌలిక వసతులు కల్పించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

కొత్తచెరువు : పేదల సంక్షేమమే వైసిపి ప్రభుత్వ ధ్యేయమని ఎంపిపి గాయత్రిరెడ్డప్పరెడ్డి, మేజర్ పంచాయతీ సర్పంచి రాధానాగరాజు, వైసిపి మండల కన్వీనర్ జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. వారు శుక్రవారం స్థానిక సచివాలయం వద్ద 'వై ఎపి నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా స్థానిక నాయకులతో కలిసి వైసిపి జెండాను ఎగురవేశారు. అనంతరం వారు ప్రతి ఇంటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు వాల్మీకి శంకర్, షాజహాన్, సోమశేఖర్‌రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, ఎంపిటిసి లక్ష్మీదేవి, రఫీ, సచివాలయ కన్వీనర్ కృష్ణమూర్తి, పెయింటర్ గిరి, కేశవ, ఎల్లప్ప, భాస్కర, శివ పాల్గొన్నారు.

ఆరోగ్యంపై గర్భిణులకు ప్రత్యేక శ్రద్ధ అవసరం

ధర్మవరం టౌన్ : గర్భిణులు తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని మానవతా సంస్థ అధ్యక్షులు తల్లం నారాయణమూర్తి, ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నజీర్ సూచించారు. మానవతా సంస్థ ఉపాధ్యక్షులు చిన్నప్ప సహకారంతో శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వా సుపత్రిలో గర్భిణులకు పండ్లు పంపిణీ చేశారు. నారాయణమూర్తి మాట్లాడుతూ దాతల సహాయ సహకారాలతో సంస్థ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంస్థ కోశాధికారి కృష్ణయ్య, సహ కారదర్శి మంజునాథ్, డైరెక్టర్లు వేణుగోపాల్, బి.రామకృష్ణ, సాయిప్రసాద్, నాగభూషణం, చంద్రశేఖర్, రామకృష్ణ పాల్గొన్నారు.

సత్యసాయి జయంతి వేడుకలపై ప్రభుత్వం నిర్లక్ష్యం : పల్లె

పుట్టపర్తి క్రైమ్ : సత్యసాయి జయంతి వేడుకలకు ప్రభుత్వం తగిన ఏర్పాట్లు చేయలేదని మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో విమర్శించారు. ఈ నెల 18 నుంచి 24వ తేదీ వరకూ జరిగే జయంతి వేడుకలకు దేశ, విదేశాల నుంచి భక్తులు, పర్యాటకులు పెద్దఎత్తున హాజరవుతారని అయితే మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. రాష్ట్రపతి ద్రౌపదిముర్ము వస్తున్నప్పటికీ నేటికీ రోడ్ల మరమ్మతులు, విద్యుత్ దీపాలు, తాగునీటి సదుపాయాలు ఏర్పాటు చేయకపోవడం బాధాకరమన్నారు. స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వం నుంచి నిధులు తేవడంలో విఫలమయ్యారన్నారు. ఇకనైనా కనీస మౌలిక సదుపాయాలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

'ఫేస్'యాప్‌ను రద్దు చేయాలి : సిఐటియు

కదిరి టౌన్ : అంగన్వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహార పంపిణీకి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫేస్ యాప్ వల్ల లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే ఈ పద్ధతిని రద్దు చేసి పాత పద్ధతినే అమలు చేయాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం సిఐటియు ఆధ్వర్యంలో లబ్ధిదారులతో కలిసి పట్టణంలోని 33వ వార్డ్ సచివాలయంలో అడ్మిన్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి జగన్మోహన్, ముస్తాక్, లక్ష్మీనారాయణ, అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మాబున్నీసా, లబ్ధిదారులు పాల్గొన్నారు.

సచివాలయంలో నాసిరకంగా విద్యుత్ పనులు

రొద్దం : నూతన సచివాలయ భవనంలో విద్యుత్ పనులు నాసిరకంగా చేయడంతో ప్రారంభమైన ఏడాది లోపే విద్యుత్ బోర్డులు, బల్బులు కాలిపోయాయి. మండల పరిధిలోని కోగిర సచివాలయ భవనం నిర్మించి సంవత్సరమైంది. అయితే విద్యుత్ పరికరాలు నాసిరకమైనవి వాడడంతో ప్రారంభించిన 6 నెలల్లోపే వైర్లు కాలిపోయాయి. గత 6 నెలలుగా సచివాలయంలో ఓ వైపు విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. దీంతో సచివాలయ సిబ్బంది నానా తంటాలు పడుతున్నారు. కిటికీల అద్దాలను ఆకతాయిలు ధ్వంసం చేశారని సిబ్బంది వాపోతున్నారు.

కోగిర సచివాలయంలో కాలిపోయిన విద్యుత్ వైర్లు